# మీసాల పి(ల్ల)ల్లి !

కాలేజీ స్టూడెంట్స్‌కు ఇష్టమైనవి రెండేరెండు ! గరల్ ఫ్రెండ్స్‌ను ఏడిపిస్తూ 'నిక్‌నేమ్స్' పెట్టటం.... రెండవది ర్యాగింగ్ ఈ రెండు సేస్తూంటే బోయ్స్‌కి పరమానందం !

నామటక్కు నాకు బిడియం జాస్తి ! పదిమందితో కలవలేను... అల్లరి చేయనూలేను. దూరం నుంచే అల్లరి చూస్తూండటమే నాకు ఇష్టం ! - ఇది ఇది ఇంటర్ నాటి పరిస్థితి!

డాడీ నన్ను డిగ్రీ చదివించలేనంటూ కాళ్లు బారజాపాడు. ఆయన ఆర్థిక స్తోమత అంతటిది ! అత్తెసరు మార్కులతో ఇంటర్ మిడికిన వాడికి డిగ్రీ ఎండకనేసి తేలిగ్గా కొట్టిపారేయటం పెద్దన్నయ్యకు నచ్చలేదు.

అన్నయ్యకు పెళ్లి అయిన సంవత్సరమే విజయవాడకు ట్రాన్స్ఫర్ కావటంతో వెంటనే భార్యా సమేతంగా అక్కడికెళ్లి కేదారేశ్వరపేటలో ఇల్లు అద్దెకు తీసుకుని దిగాడు.

అన్నయ్య జీతమూ ఆరోజుల్లో అంతంత మాత్రమే అయినాసరే కొత్త కాపురానికి నేను అడ్డంకిగా వుంటానని భావించకుండా... అక్కడ కాలేజీలో జాయిన్ చేసి చదివించాలనే వుద్దేశ్యంతో డాడీ అంగీకారం తీసుకుని నన్నూ వెంట తీసుకెళ్లటం నిజంగా నా అదృష్టం !

బి.కామ్. లో సీటు కోసం ఆరోజుల్లో కూడా అన్నయ్య ఎం.ఎల్.ఏ. కాళ్లు పట్టుకోవాల్సివచ్చింది. నాకోసం ఎంతో చేస్తున్న అన్నయ్యకు మనసులోనే కృతజ్ఞతలు తెల్పుకున్నాను.

ఎస్సారార్ అండ్ సివిఆర్ కాలేజీలో చేరి టరమ్ ఫీజు చెల్లించిన మరుక్షణం నాకేదో అందలం ఎక్కినట్టు ఫీలయ్యాను. నా ఆశ ఫలించినందుకు పరమానందం!.

'ఇదిగో మరిదీ... మీ అన్నయ్య నెల జీతగాడేగాని జిల్లా కలెక్టర్ కాదని నీకు తెలుసుగా. చిల్లరగాళ్లతో స్నేహాలు చేసి చెడిపోకుండా శ్రద్ధగ చదివి డిగ్రీ అందుకో !

అప్పుడు కష్టపడినందుకు నీకు... చదువు చెప్పించిన మీ అన్నయ్యకూ ఫలితం దక్కుతుంది...' జాయిన్ అయిన రోజే క్లాసు పీకింది వదిన.

అన్నయ్యకు పాకెట్‌మనీతో పన్లేదు. ఇంట్లో భోజనం చేసి బయల్దేరితే మళ్లీ ఇంటికి తిరిగొచ్చాకే తిండి ! బైట కాఫీ కూడా తాగడు. ప్రిన్సిపుల్స్ కలవాడు అన్నయ్య.

కాలేజీ మాచవరంలో ! మేముండేది కేదారేశ్వరపేట ! ఈ రెండిటి మధ్య దూరం అప్ అండ్ డౌన్ కలిసి పదికిలోమీటర్లు పైనే... అదీ అడ్డదారి అయితే !

సిటీ బస్సులు ఆరోజుల్లో ఈరోజుల్లో లాగ ఈగలు దోమలు తిరుగుతున్నట్టుండేవి కావు.

అయినా కాలేజీ వేళల్లో తప్పని సరి ట్రిప్పులుండేవి. వదినతో సిటీబస్‌లో వెడతాననటానికి ధైర్యం చాల్లేదు. కాబట్టి కాళ్లకు బుద్ధి చెప్పటం ఒకటే సరైన మార్గం అన్పించింది.

పోనీ సైకిలైనా వుంటే బాగుండన్పించి వదిన చెవిన వేశాను.

నా ప్రపోజల్ అన్నయ్యకు చెప్పకపోగా...'చూడు మరిదీ ! మీ అన్నయ్య ఆఫీసు దుర్గ గుడి దగ్గర. ఆయనే డొక్కు సైకిలు మీద పోయి వస్తున్నాడు. ఎందుకని? పొదుపుగా బ్రతకాలి కనుక! కొత్త సైకిలు కొన్లేక. ఇది అయ్యే పనికాదు...' వాతపెట్టినట్టు మాట్లాడటంతో నా నోటికి తాళం పడినట్టయింది.

'మా దగ్గర నిన్ను వుంచుకుని చదివించటమే గొప్ప! మీ అన్నయ్యది దమ్మిడీ పై సంపాదన లేని వుద్యోగం!. ఎవర్నీ ఏదీ చెయ్యి చాచి అడగరు. నీకు తెల్పిందేగా...' మరో చురకేసింది.

ఇంకా వదిన ఎదుటే నిలబడగల ధైర్యం లేక వీధినపడి ఫ్రెండ్ ఇంటికి బయల్దేరాను.

X X X

కో ఎడ్యుకేషన్ వున్న కాలేజీ అవటాన ఆడ మగ స్టూడెంట్స్ ఆల్మోస్ట్ ఫిఫ్టీ ఫిఫ్టీ !.

కాలేజీలోకి ఎంటరవగానే కుడివైపు సైకిలు స్టాండ్ ! అక్కడ కుర్రాళ్లు తారట్లాడుతుంటారు. మగపిల్లలు నిలబడివున్న ముందు నుంచే గరల్స్ వాళ్ల క్లాసురూమ్‌లోకి వెడుతూంటారు.

పాఠాలు చెప్పటం ఇంకా మొదలు కాకపోవటంతో కుర్రాళ్లు అధిక సంఖ్యలో

సైకిల్‌స్టాండు వద్దే సెటిలైపోతారు.

వచ్చే పోయే గరల్ స్టూడెంట్స్‌ను ఏడిపించటం...'నిక్‌నేమ్స్' పెట్టటం... ఇదీ కుర్రాళ్ల పని !. డిగ్రీలో జాయినయిన తర్వాత నాలోనూ కాస్తంత ధైర్యం పుంజుకుంది. నాలుగు అడుగులు ముందుకేసి ఏడిపించే వారితోచేయికలిపాను ! అల్లరి చేస్తూ తిక్క వేషాలు వేస్తూ మురిసిపోవటంలో వున్న ఆనందం మరెందులోనూ వుండదన్పించేది.

రౌడీ ఆడపిల్లలు ఎదురు తిరిగి కళ్లెర్ర చేస్తూండటం... మరికొందరు కాలిచెప్పు విడిచి చేతిలోకి తీసుకుని బెదిరించటంలాంటివి చేసినపుడు మేమంతా కుక్కిన పేనులా వుండేవాళ్లం ! అక్కడి నుంచి మెల్లగ జారుకునే వాళ్లం !

లావుపాటి పర్సనాలిటీ వున్న అమ్మాయిని చూస్తూ 'తిమింగలం' అని పిలిచేవాళ్లం. వినపడాలని గొంతెత్తి అరిచేవాళ్లం.

కాలేజీ అన్న తర్వాత కో-ఎడ్యుకేషన్ వుంటేనే థ్రిల్ ! సీతాకోక చిలుకలు లేని కాలేజీ స్మశానంలా వుంటుంది.

'తిమింగలం' అంటూ నిక్‌నేమ్‌తో పిలిచే అమ్మాయి ప్రిన్సపాల్ గారి బంధువని తెల్సిన అమ్మాయిని ఏడిపించటం మానుకున్నాం. విషయం ఆయనకు తెలిస్తే ఎక్కడ టి.సి. ఇచ్చి పంపించేస్తాడేమోనే భయంతో.

డిగ్రీలో చేరాకనే మెచ్యూరిటి కన్పించింది. ఏదో తెలియని పెద్దరికం ఆవహించేది. కేవలం ఏడిపించటానికే పరిమితం కాకుండా... కంటికి... మనసుకు నచ్చిన అమ్మాయిని లవ్ చేయాలన్పించేది. నావంటి వాడికిది తగునా ? - విషయం అన్నయ్య వదినలకు తెలిస్తే చదువు మాన్పించి డాడీ దగ్గరకు పంపేస్తాడు. అలా జరిగితే భవిష్యత్ అంధకారమే !

నాదగ్గర డబ్బులుండేవి కావు. ఏ గరల్‌ఫ్రెండ్‌తోనైనా పిక్చర్‌కెళ్లాలంటే... అది తీరని కోరికే !. అప్పటికీ అప్పుడప్పుడు ఆబుక్ కొనాలి... ఈ బుక్ కొనాలంటూ.. అబద్ధం చెప్పి వదిన దగ్గర డబ్బులడుక్కోవడం, ఫ్రెండ్స్ కొనుక్కున్న బుక్స్ తెచ్చి వదినకు చూపించి వాటిని తిరిగి ఇచ్చేయటం !. ఈ విధంగా నొక్కేసిన డబ్బులను అన్ని అవసరాలకు జాగ్రత్తగా వాడుకుంటుండేవాడిని.

అందరిలోకి నాకో అమ్మాయి నచ్చింది. పేరు సౌమిత్రి! సైన్స్ స్టూడెంట్!.. సౌమిత్రి

ఎంతో అందం నన్ను అబ్బురపరిచేది. నాకు నచ్చిన అమ్మాయి మూతిమీద మగపిల్లలకు మల్లే నూనూగు మీసాలున్నాయని గమనించి సౌమిత్రికి 'మీసాలపిల్లి' అనే నిక్‌నేమ్ పెట్టాను. వెంట నడుస్తూ మ్యావ్... మ్యావ్... అని ఏడిపించినా సైలెంట్‌గ వుండేది. పైగా నా వేపు చూచి అదోలా నవ్వి నన్ను కవ్వించేది. నేను వేసే జోక్స్‌కి పగలబడి నవ్వేది.

హు ! ఈ ఫ్రెండ్‌షిప్.. ప్రేమ... ఎన్నాళ్లు? ఎడ్యుషన్ పూర్తి అయి ఎవరిళ్లకు వాళ్లు వెళ్లిపోయే వరకే !. ఆతర్వాత అంతా మర్చిపోతారు. ఎవరికివారే... యమునాతీరే !. ఎప్పుడో... ఎక్కడో తారసపడ్డప్పుడు ఒకరినొకరు గుర్తించుకుని హాయ్ చెప్పుకుని కుశలమడిగి మళ్లీ విడిపోవటం! - ఆడపిల్లలైతే బోయ్‌ఫ్రెండ్స్ పలకరించినా ఎరగనట్టే ముఖంపెట్టి వెళ్లిపోతూంటారు.

మీసాలుండే ఆడపిల్లలు... మూతి మీసాలను క్లీన్ షేవ్ చేసుకునే కుర్రాళ్లనే గుర్తించి లౌచేస్తారు. ప్రత్యేకంగ గుర్తింపడబడతారు. మగాడికి మీసం అందం !. మా అంకుల్‌కు పౌరాణిక నాటకాల పిచ్చి. ఆయన స్టేజి ఎక్కి రాయబారంలో పద్యపాడితే వన్స్‌మోర్లే !

మొట్టమొదటిసారిగ అంకుల్‌ను కృష్ణుడు వేషం వేయమన్నప్పుడు... ఆయన ముచ్చటపడి ముద్దుగా పెంచుకున్న కోరమీసాన్ని గొరిగించుకోను ఇష్టపడ్లేదట !. అయినా సరే కృష్ణుడి వేషానికి భలేగా సూట్ అవుతాడన్పించింది మీసాలతోటే వేషం వేయించి నాటకం వేస్తే భలేగ రక్తి కట్టించాడు శ్రీకృష్ణుడి వేఘషాన్ని. అప్పటి నుండీ ఆయన్ను 'మీసాల కృష్ణుడు' అంటూ అందరూ పిలిచేవారట !.

నామటుక్కు నాకు మీసాలు పెంచటం ఇష్టముండదు. ఆ కారణాన మూడో వ్యక్తి దగ్గర్లో లేని సమయం చూచి ఓరోజున 'ఓ మీసాల పిల్లీ... నీమీసాలు నాకు ఇచ్చేయరాదూ' అనగానే సౌమిత్రి వరల్డ్ పకపకా నవ్వింది.

సౌమిత్రి నవ్వితే ముత్యాలు రాలినట్టన్పిస్తయ్ ! మీసాల్లేకుంటే సౌమిత్రి వరల్డ్ బ్యూటీకేమాత్రం తీసిపోదు.

'నన్ను పెళ్లిచేసుకో... నా మీసాలు నీకిచ్చేస్తా' నంటూ తిరిగి సౌమిత్రి బదులివ్వటం నన్ను వుత్తేజ పరిచేది.

ఫైనలియర్ ఎగ్జామ్ రాసేదాకా మేమిద్దరం చాలా క్లోజ్‌గ మూవ్ అయినాం!.

తర్వాత ఎవరిదోవన వాళ్లు వెళ్లిపోయాం !

మీసాల పిల్లి నాకెప్పుడూ గుర్తుకొస్తునే వుండేది ! నన్ను సౌమిత్రి ఎప్పుడైనా తల్చుకుంటుందో లేదో? అనుకునేవాడిని. బహుశ నన్ను మచ్చిపోయివుంటుంది.

ఎగ్జామ్ రాయగానే అన్నయ్య నన్ను డాడీ దగ్గరకి పంపించేశాడు. ట్రెయిన్ కదిలేదాకా నాతోనే వుండి 'పరీక్ష బాగా రాశావుట్రా?... మంచి మార్కులతో పాసవుతావా?.. నా పేరు నిలుపుతావా? -' అదోలా అడిగాడు. ఆక్షణంలో అన్నయ్య కళ్లల్లో నీళ్లు చూశాను.

రైలు కదిలింది! కనమరుగయ్యే దాకా అన్నయ్య ప్లాట్‌ఫారమ్ మీద నిలబడి చెయ్యి వూపుతూనే వుండటం గమనించి మురిశాను. నేనంటే అన్నయ్యకు చాలా ప్రేమ అనుకున్నాను మనసులో! వదిన కూడా మంచిదే!. కాకపోతే అదోటైపు ! ఆడవాళ్లంతా అంతేనేమో !

XXX

బి.కాం. లో మంచి పర్సంటేజ్ వచ్చింది. ఆర్నెల్లు తిరక్కుండానే బ్యాంక్ జాబ్ రావటం చూచి ఫామిలీమెంబర్సంతా తెగ సంబరపడ్డారు. మా డాడీ కంటే అన్నయ్య ఎక్కువ సంతోషించాడు.

నాకు వుద్యోగం వచ్చిన సంవత్సరంలోనే డాడీ రిటైరైనాడు. ఆరోజుల్లో టీచర్లకు పింఛన్ సదుపాయం లేకపోవటంతో మమీ డాడీ నా దగ్గరకొచ్చేశారు.

అన్నయ్య ప్రమోషన్‌పై వైజాగ్ బదిలీ అయి మాకు దూరమైనాడు. నా వుద్యోగం గుంటూర్లో ! డాడీ రిటైరైంది బాపట్లలో !.

ఒకరోజున ఇంట్లో పెళ్లి ప్రస్తావన వచ్చింది. మమ్మీ వెంటనే పెళ్లి చేసేద్దామని.. కొన్నాళ్లపాటు ఆగిచేస్తే బాగుంటుందని వాదులాట!. బంధువుల అమ్మాయని ఒకరు.. పరాయి సంబంధమైతేనే బాగుంటుందని మరొకరు. ఇంట్లో రోజే డిబేటు ! నేనైతే గ్రీన్‌సిగ్నలిచ్చేశాను.

పిల్ల నచ్చటంమటుక్కే నావంతు ! మిగతా విషయాలను పేరెంట్స్ కొదిలేశాను.

వైజాగ్ నుంచి వదిన ఒకటే ఫోన్లు !. వాళ్ల చిన్నమ్మ కూతురుందిట ! పిల్ల చక్కనిది... చదువుకుంది... నగనట్రా వుంది... కట్నకానుకలు ఇవ్వగలవారంటూ

సతాయింపు !

వదినగడుగ్గాయని... ఆమెగారి పిన్ని కూతురు ఎంకెంత లక్షణంగ వుంఉందోని మమ్మీ ససేమిరా అనేసింది.

రెండేళ్లు మనవాడిని వాళ్లింట్లో వుంచుకుని ఇంత తిండి పెట్టి బాగోగులు చూసిందే కోడలు... ఇప్పుడు ఆమె మాట కాదని కొట్టేస్తే నీలుగుతుంది. ఆతర్వాత నీ ఇష్టం...' నచ్చచెప్పబోయాడు.

పెద్దవాళ్ల వాదులాట సాగుతోంది !

ఆదివారం కావటాన... బద్దకంగ పడుకొట్టేక నిద్రలేచి వాష్ బేసిన్ దగ్గర నిలబడి బ్రష్ చేసుకుంటూండగ 'రేపు మనం మంగళగిరి వెడుతున్నాం' డాడీ కేక విన్పించటంతో తలపక్కకు తిప్పి ఎందుకట అని సైగచేస్తూ అన్నాను నోట్లో బ్రష్ మరియూ టూత్‌పేస్ట్ నురగవుండటాన.

'పెళ్లి సంబంధమోయ్ ! పిల్లను చూడటానికి' డాడీ రిప్లై.

'ముందు మీరు మమ్మీ వెళ్లి చూచిరండి. మీకు పిల్లనచ్చితే తర్వాత నేను...' అనేశాడు.

'వీల్లేదు... నువ్వూ వస్తున్నావ్... పిల్ల అందరికీ నచ్చితే... అక్కడికక్కడే తాంబూలాలు మార్చేసుకుందాం ! లక్షణమైన సంబంధమట...'

'ఎవరు చెప్పారు...' అడిగాను

'మా ఫ్రెండు ప్రపోజ్ చేసిన సంబంధమే ఇది...' అతనే చెప్పాడు సరేనీకు... ఇంకేమైనా డిటెయిల్స్ కావాలా ? -' గుడ్లురిమాడు.

డాడీ మాట కాదన్లేక తలాడించాను.

ముగ్గరం పోవటం బాగుండదని పక్కింటి ఆంటీ వాళ్ల పదేళ్ల అమ్మాయిని వెంట తీసుకుని టాక్సీలో బయల్దేరాం !

'ఎట్లాగూ వెళ్తున్నాం కదా... పానకాలస్వామివారి దర్శనంచేసుకొద్దాం...' ప్రపోజల్ డాడీది.

'నేను మెట్లు ఎక్కలేను, మోకాళ్ల నెప్పులతో సతమతమౌతున్నాను...' నిట్టూర్చింది మమ్మీ.

అర్ధగంటలో టాక్సీ పిల్ల తండ్రిగారింటి ముందు ఆగింది. పిల్ల తండ్రి మరో నలుగురు మాకై ఎదురు చూస్తున్నట్టు వాకిట్లో నిలబడి కారుదిగిన మాకు సాదర ఆహ్వానం పలికారు.

ఇంట్లోకి నడిచి సోఫాల్లో కూర్చున్నాం! పలకరింపులు పూర్తి అయినయ్...

'పెళ్లిచూపుల తంతు అయితే... మిగతా విషయాలు తర్వాత' డాడీ అనటంతో తల్లి వెంట తలదించుకు సిగ్గు అభినయిస్తూ పిల్ల వచ్చి నేలమీదున్న చాపపై కూర్చుంది.

తలపైకెత్తి మమ్మల్ని చూడమ్మాని మమ్మీ అనటంతో తల ఎత్తి నన్ను చూచి నివ్వెరపోయింది.

నేను దిగ్భ్రాంతికి లోనయ్యాను.

'డాడీ.. మీసాల పిల్లి...' బిగ్గరగా అరిచాను.

అక్కడున్నవారంతా బిత్తరపోయారు.

ఎవరో అనుకున్నాను... నువ్వా సౌమిత్రీ.. నా లవ్లీ డాలీ... నా మీసాల పిల్లీ... గడగడా అన్నాను...

పిల్లేమిట్రా... ఏమిటా తిక్కమాటలు... పరిస్థితి అర్థంకాక డాడీ కంగారుపడుతూ నన్నడిగేడు.

'సౌమిత్రి నేను కాలేజీలో మంచి స్నేమితులం.. నేను పెట్టిన నిక్నేమ్... అదే ముద్దుపేరు 'మీసాల పిల్లి...' ఫక్కున నవ్వాను  గతం గుర్తొచ్చి.

డాడీకి క్లారిటీ వచ్చింది ! తాంబూలాలు పుచ్చేసుకుందాం అనేశాడు !.

సౌమిత్రి తెగమురిసింది అవ్ చేసిన నన్నే మ్యారేజ్ చేసుకోబోతున్నందుకు !!

--- సమాప్తం ---

(వాస్తవ సంఘటనకు ఆధారమే ఈ కథ)